# మాతృ ప్రేమ

**********************************

రచన: శ్రీ వి. భాస్కర్

**********************************

రాధ నొప్పులతో బాధపడుతుంది. 'అమ్మా, అయ్యా' అంటూ నొప్పితో బాధ పడుతుంది.

గది బయట అశోక్ హృదయంలో గందరగోళం చలరేగ సాగింది 'ఈ పుట్టబోయే పాపిష్టి బిడ్డవలన రాధ ప్రాణానికి భయంలేదు కదా!' మనసులో అనుకున్నాడు అశోక్.

ఆలోచనలమధ్య ఇతని హృదయం ఇరుక్కుపోయినపుడు, అనుకోకుండా 'కెవ్వు' మంటూ పాప ఏడ్పు వినిపించింది.

అశోక్ హృదయం ఒక్కసారిగా ఆలోచనల మధ్యనుండి బయటకు వచ్చి సంతోషంతో నిండిపోయింది.

గదినుండి బయటకు వస్తున్న దాయిమ్మను చూచి సంతోషంతో పొంగిపోయాడు.

"మగబిడ్డ బాబు!" అంటూ ఆ దాయమ్మ చెప్పి వెళ్ళిపోయింది.

అశోక్ ఆనందానికి అంతేలేదు.

ఒక సంవత్సరం గడిచిపోయింది.

కారు ఆక్సిడెంట్‌లో అశోక్ మరణించాడు. రాధ జీవితం ముక్కలు చింపిన విస్తరిలా అయింది. చివరకు బిడ్డను పోషించుకునే స్థితి కూడా లేకపోయింది, అయినప్పటికిని బిడ్డపై మమకారంతో, ప్రేమతో ఆత్మహత్య చేసుకోక, కూలిపని చేస్తూ బిడ్డను పోషించుకో సాగింది.

కాలచక్రంలో కొన్ని సంవత్సరాలు గిర్రున తిరిగిపోయింది.

బిడ్డను చదివించాలనే ఉబలాటం కలిగింది రాధకి. కాని ఎలా చదివించగలదు? అదే సమస్యగా మిగిలిపోయింది రాధకి.

ఒకనాడు ఈశ్వరయ్య అనే ఒక ధనవంతుడు రాధని చూసి జాలిపడి సహాయం చేయాలనుకున్నాడు. కాని అతని మనసు రాధని పొందాలనే ఉబలాట పడసాగింది. ఆమెని పొందటం ఎలా? ఆమె వ్యభిచారిణి కాదే! ఆమె ఒక సమస్కారం గల స్త్రీ. ఆమెని అర్థాంగిగా చేసుకోవాలనే ఆలోచన కలిగింది. కాని, సంఘంలో తన విలువ నశిస్తుందని, ఆమెని తన స్వంతం చేసుకుని రహస్యంగా కలువసాగాడు. బిడ్డ భవిష్యత్తుకోసం తన జీవితాన్నే బలిచేసుకుంది రాధ.

ఈశ్వరయ్య దయవలన వీరిద్దరికి ఏ లోటూ లేకుండా జీవితం సాగింది.

రాధ కుమారుడు పాఠశాలకు పోసాగాడు.

ఈశ్వరయ్య ప్రేమతో రాము అని పిలుచుకో సాగాడు.

ఈశ్వరయ్య చీకటి బ్రతుకుకు రాధ వలన ఒక వెలుగు కన్పించింది.

సంవత్సరాలు గడిచిపోయాయి.

రాము B. A. పాసయ్యాడు.

"అమ్మా! నాన్న వారంరోజులుగా ఇంటికి రావడంలేదే!" అడిగాడు రాము.

రాధ రెండు కన్నీటి బిందువులు జారవిడిచింది.

"ఎందుకమ్మా బాధ!" ప్రాధేయ పూర్వకంగా అడిగాడు రాము.

రాధ గతాన్నంతా వివరించింది.

రాము ముఖంలో రంగులు మారాయి. "అమ్మా! ఈ పాపపు డబ్బుతో నన్ను ఉద్ధరించావా, సంఘంలో ఎవరయినా మీ నాన్న ఎవరా? అంటే ఏమని చెప్పను? నా ముఖము ఎలా చూపను" బాధతో తల్లడిల్లి పోయాడు రాము

"రామూ! నాన్నగారి దగ్గరకు పద. ఈ రహస్య జీవితానికి స్వస్తి చెప్పమందాం. నీ మనసుకు బాధ కలుగ జేసుకోకు" అంటూ ఈశ్వరయ్య ఇంటికి బయలుదేరారు రాధ, రాము.

ఈశ్వరయ్య రోగంతో మంచం పట్టాడు. పెద్దలంతా అతని చుట్టూ కూర్చున్నారు.

"ఏమండీ! ఈ రహస్య జీవితం ఇక చాలు. మీ సేవ చేసుకుంటూ మీ అర్ధాంగిగా (లోకానికి తెలిసే విధంగా) ఇచటనే పడివుంటాను. ఈ బాబు 'నాన్న ఎవరు'? అంటే ఏమని చెపుతాడు. ప్రాధేయపడసాగింది.

సంఘంలో తనవిలువ పోతుందనే భయంతో రోగంలో వున్న పెద్దమనిషి ఈశ్వరయ్య 'ఈమె ఎవరో నాకు తెలియదు' అన్నాడు. ఆ తరువాత రెండు నిముషాలకే కళ్ళు మూసాడు.

రాధ బాధతో బయటకు వచ్చింది.

కొన్నాళ్ళ తరువాత రాము ఒక ఆఫీసర్ కాగలిగాడు.

తల్లిని చూసి అసహ్యించుకున్నాడు. తల్లిని ఇంట్లోంచి గెంటి వేసాడు. అయినప్పటికి ఆ తల్లి 'నీవు బ్రతికినంత కాలం సుఖంగా బ్రతకాలి' అంటూ ఇంట్లోంచి వెళ్ళిపోయింది.

ముష్టి ఎత్తుకుంటూ బ్రతకసాగింది.

ఒక అందమయిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు రాము.

ఆమెవలన చెడు వ్యసనములకు లోనయి ఉద్యోగాన్ని వదులుకున్నాడు.

కొద్ది రోజుల్లోనే ఆ అమ్మాయి ఉన్నడబ్బు సొమ్ము అంతా కాజేసి, ఊరంతా అప్పులు చేసి ఇంట్లోంచి పారిపోయింది.

రాము మనసు కలత చెంది, కొద్ది రోజుల్లోనే ఏదో భయంకర వ్యాధికి గురి అయినాడు. అంతా కోల్పోయాడు. చివరకు తన బ్రతుకు వీధులపాలయింది.

ఒక చోట స్పృహతప్పి పడిపోయాడు రాము.

ఒక ముష్టిది రామును తన గుడిసెకు తీసుకుపోయి తెలివిలోకి రప్పించింది.

ఆ ముష్టిది ఎవరూ కాదు. రాము తల్లి రాధ.

తల్లిని గుర్తించాడు రాము. తను చేసిన తప్పు క్షమించమన్నాడు. మాతృ ప్రేమను గుర్తించి తల్లి ఒడిలో వ్యాధినుండి కోలుకున్నాడు.

మాతృ ప్రేమను గుర్తించిన రాము కూలి వాడుగా జీవిస్తూ తల్లిని పువ్వుల్లో పెట్టి పూజింప సాగాడు.

